# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన పొదుపు సూచనలు పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు.

❖ ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

❖ రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

❖ ఆక్వా రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నీ ప్రభుత్వం సహించబోదని మత్స్య శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

=========================

అమరావతితో పాటు.. విశాఖపట్టణాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని నిడమర్రులో కిమ్స్ ఆసుపత్రికి, బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి ఈరోజు భూమి పూజ, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాయలసీమ హార్టికల్చర్, టెక్నాలజీ హబ్ గా మారుతుందని, తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. లక్షల ఉద్యోగాలు యువతకు ఇవ్వాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని, వచ్చే సంవత్సరం ఇదే రోజుకు ఆసుపత్రి, యూనివర్సిటీ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నామన్నారు. ఇటీవలే విశాఖలో గూగుల్ కు ఫౌండేషన్ వేశామని, 2028 ఆగస్టు 15 కంటే ముందే గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుందని తెలిపారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన సూచనలను పాటించాలని ముఖ్యమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని ముఖ్యమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని సైబర్ నేరాలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సైబర్ నేరాల్లో తక్షణ స్పందన - రాష్ట్రంలో నియంత్రణా వ్యవస్థపై అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై సమావేశంలో చర్చించారు. ఇతరుల బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లు వినియోగించకుండా చేపట్టాల్సిన చర్యలు, గోల్డెన్ అవర్, ఏపీ సైబర్ పాలసీ తదితర అంశాలపై సమాలోచనలు చేశారు. సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి 9.29 లక్షల కాల్స్ బాధితుల నుంచి 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు వచ్చినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకూ సైబర్, ఆర్థిక నేరాల్లో 652 కోట్ల రూపాయల మేర కోల్పోయినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

========================

ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తిరుపతిలో పర్యాటక శాఖ అధికారులతో మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలో పర్యాటక శాఖ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29ని అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రైవేట్ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే తిరుపతిలో ఆరు స్టార్ హోటళ్ల నిర్మాణానికి పీపీపీ విధానంలో ప్రతిపాదనలు వచ్చాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకానికి స్వర్గధామంగా మారుస్తామని మంత్రి దుర్గేష్ వివరిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

========================

రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనేదే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని గ్రామీణ పేదరిక నిర్మూలన (సెర్ప్) శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సెర్ప్ అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. పాడి పరిశ్రమ ప్రధాన జీవనోపాధిగా ఉన్న అన్ని గ్రామాల్లో పశుగ్రాసం పెంపకం ప్లాట్లను అభివృద్ధి చేయడంతో పాటు ఐదు కంటే ఎక్కువ పాడి పశువులు ఉన్న స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలను గుర్తించి.. పాల సేకరణ, బాట్లింగ్, సొంత బ్రాండ్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఇళ్ల వద్ద పెరటి కోళ్ల పెంపకం కోసం మదర్ హేచరీల ఏర్పాటుకు ప్రోత్సాహకాలపై కూడా చర్చించారు. ఎంపిక చేసిన మండలాల్లో పొట్టేళ్ల పెంపకం యూనిట్లను ప్రోత్సహించడం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY) పథకాల కింద మహిళా సంఘాల సభ్యులందరినీ నమోదు చేయడం, బ్యాంకుల నుంచి డేటాను సేకరించి సెర్ప్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయడం, క్లెయిమ్స్ పరిష్కార పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుపై చర్చించారు.

========================

ఆక్వా రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నీ ప్రభుత్వం సహించబోదని రాష్ట్ర మత్స్య శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలను ఒక్కసారిగా పెంచడంపై ఆయా సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాలు, అధికారులతో మంత్రి ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ధరలు పెంచడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో రైతులపై అదనపు భారం మోపే చర్యలు తీసుకుంటే

ప్రభుత్వం సహించబోదని హెచ్చరించారు. మంత్రి ఆదేశాలను అనుసరించి రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల అసోసియేషన్ పెంచిన ధరల అమలును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా తెలియజేసింది.

==========================

జర్నలిజం రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాత్రికేయులకు 2025-26 సంవత్సరానికి గాను అవార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. విజయవాడలోని మీడియా అకాడమీ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తో కలిసి ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. అవార్డుల ఎంపిక, ప్రదానం కోసం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించిందని తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం 12 విభాగాల్లో ఈ అవార్డులను ఇవ్వనున్నట్లు చైర్మన్ వెల్లడించారు. ఆయా అవార్డులకు అర్హతలు, దరఖాస్తుకు చివరి తేదీ మొదలగు వివరాలను తెలియజేస్తూ... త్వరలో ఒక ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు.

==========================

కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈరోజు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వరితో పాటు 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపును ఆమోదించింది. 2026-27 ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకు 2.6 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. క్వింటాల్ వరికి కనీస మద్దతు ధర 2,441 రూపాయలుగా నిర్ణయించారు. వరి (ఏ గ్రేడ్)కి 2,461 రూపాయలకి పెంచారు. క్వింటాల్ జొన్నలు (హైబ్రిడ్) కనీస మద్దతు ధర 4,023 రూపాయలకు ఆమోదం తెలిపింది. జొన్నల ధర 4,073 రూపాయలుగా నిర్ణయించింది.

==========================

రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2026-27 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (MSP) రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగం బలోపేతమే లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

==========================

ఈనెల 16వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాత ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలపై నైరుతి రుతుపవనాల పురోగమనానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంపై ఏర్పడిన నిన్నటి అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతోందని వెల్లడించింది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రా, రాయలసీమలో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని హెచ్చరించింది.

==========================

==========================